## నవోదయ దరఖాస్తుల గడువు పెంపు

కాగజ్‌నగర్, అక్టోబర్ 31: జవహర్ నవోదయ విద్యాలయంలో 2024–25 విద్యా సంవత్సరానికి తొమ్మిదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశ పరీక్ష ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు నవంబర్ 7 వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ చక్రపాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రభుత్వ ఆమోదిత విద్యాలయాల్లో ఎనిమిదో తరగతి, పదో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## పంట ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి



ధ్వంసం చేసిన పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

దహెగాం, అక్టోబర్ 31 :మండలంలోని ఇట్యాల గ్రామానికి చెందిన బుద్దె గురువయ్యకు చెందిన పత్తి పంటను ధ్వంసం చేసినవారిని కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. ధ్వంసం చేసిన పత్తి పంటను మంగళవారం పరిశీలించి రైతు గురువయ్యకు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గురువయ్య తన నామినేషన్ కోసం విరాళం అందించారని, అది మనసులో పెట్టుకొని కొందరు గిట్టని వారు కక్షసాధింపు చర్యగా పంటను ధ్వంసం చేశాన్నారు. సదరు రైతుకు నష్టపరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. గురువయ్యకు పార్టీ అండగా ఉంటుందని హామీనిచ్చారు. సర్పంచ్ వశాక మురారి, ఉప సర్పంచ్ ఎస్కే షరీఫ్, బీఆర్‌ఎస్ నా యకులు గజ్జల సురేశ్, మాలీ సంఘం అధ్యక్షుడు నీగేశ్ ఉన్నారు. కాగా గురువయ్య 8 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేయగా, గుర్తు తెలియని దుండగులు రాత్రివేళల్లో సుమారుగా 2 ఎకరాల పంటను ధ్వంసం చేశారని ఎస్ఐ సనత్‌కుమార్ తెలిపారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## ఎక్సైజ్ అధికారుల దాడులు


కాగజ్‌నగర్/దహెగాం, అక్టోబర్ 31: జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతికిరణ్ ఆదేశాల మేరకు కాగజ్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మంగళవారం దాడులు నిర్వహించామని ఎక్సైజ్ సీఐ మంగమ్మ తెలిపారు. మండలంలోని ఈస్‌గాంలో అరికిల్ల మల్లయ్య కిరాణా షాపులో 180 ఎంఎల్ 14 క్వార్టర్లు, 10 లీటర్ల నాటుసారా లభించాయని పేర్కొన్నారు. మద్యాన్ని స్వాధీనం చేసుకొని నిందితుడు మల్లయ్యపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే దహెగాం మండలంలోని కల్వాడ గ్రామ శివారులో నాటు సారాకు ఉపయోగించే 3 00 లీటర్ల బెల్లంపానకం ధ్వంసం చేసినట్లు చెప్పారు. ఎక్సైజ్ ఎస్ఐ ఆర్ కిషన్, సిబ్బంది పాల్గొన్నారు.

## క్షమాపణలు చెప్పాలి

ఆసిఫాబాద్ టౌన్, అక్టోబర్ 31 : హిందూ మతంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ వెంటనే హిం దూ సమాజానికి బహిరంగ క్షమాపణలు చెప్పాలని హిందూ వాహినీ జిల్లా ఉపాధ్యక్షుడు సైదం నాగరాజు డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల సిర్పూర్ నియోజకవర్గంలోని కౌటాల మండలంలో ప్రచారంలో భాగంగా ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ కాషాయ కండువా ఆదివాసులను నాశనం చేసే కండువా అని, అలాగే మత కల్లోలాలు సృష్టించే కండువా అని హిందువుల మనోభావాలు దెబ్బతినేలా వివాదాస్పద వ్యాఖ్యాలు చేశారని మండిపడ్డారు. వెంటనే వ్యాఖ్యానం వెనక్కి తీసుకొని హిందువులకు క్షమాపణ చెప్పాలి లేకుంటే ఈ ఎన్నికల్లో ప్రవీణ్‌కు మార్గంబు చిత్తుగా ఓడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో హిందూ వాహి నీ జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డల ప్రణయ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు పిప్రే సాయి, గడ్డల కరణ్, సంజయ్, శ్రీకాంత్, సాయి పాల్గొన్నారు.

# అభివృద్ధిని చూసి ఆదరించండి

- పెంచికల్ పేట్ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తిరుపతి
- గ్రామాల్లో ముమ్మర ప్రచారం



పెంచికల్ పేట్ : దరోగపల్లిలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పెంచికల్‌పేట్, అక్టోబర్ 31 : తొమ్మిదేళ్లలో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప చేసిన అభివృద్ధిని చేసి ఈ ఎన్నికల్లో మరోసారి ఆదరించాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తిరుపతి కోరారు. మండలంలోని దరోగపల్లిలో నాయకులు, కార్యకర్తలతో కలిసి మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మ్యానిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తూ అందులోని పథకాలను ప్రజలకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా కోనేరు కోనప్పను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు జాజిమొగ్గ శ్రీనివాస్, రాజన్న, సంజీవ్, సుధాకర్, దేవాజీ, చంద్రమౌళి, మండల కో ఆప్షన్ సభ్యుడు సాజిత్, బీఆర్ఎస్ నాయకులు సీహెచ్. శ్రీనివాస్, ఎస్కే బాబు, సముద్రాల రాజన్న, బండన్న, సత్యనారాయణ, బాపురావు ఇలియాస్, దయాకర్ గౌడ్, చంద్రకాంత్, యువకులు మహిళలు పాల్గొన్నారు.

### కౌటాల మండలంలో..

కౌటాల, అక్టోబర్ 31: మండలంలోని పలు గ్రామాల్లో సర్పంచ్‌లు, బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ప్రచారం నిర్వహించారు. మండల కేంద్రంలోని శివలింగపూర్‌లో సర్పంచ్ వొజ్జల మౌనిశ్, మండలాధ్యక్షుడు వసంత్ రావు ఆధ్వర్యంలో కోయగూడ, గురుడుపేట, కనికి గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ బీఆర్ఎస్ మ్యానిఫెస్టో, సీఎం కేసీఆర్ పాలన, సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు, ఎమ్మెల్యే అందించిన సేవలు, అభివృద్ధిని వివరించారు. అదేవిధంగా సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు కూడా ప్రచారం చేపట్టారు. కారు గుర్తుకు ఓటు వేసి కోనప్పను భారీ మెజార్టీతో గెలుపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారంలో మండల, గ్రామస్థాయి బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

### దహెగాం మండలంలో..

దహెగాం, అక్టోబర్ 31 : మండలంలోని కమ్మర్‌పల్లి, కల్వాడ, ఒడ్డుగూడ గ్రామాల్లో దహెగాం జడ్పీటీసీ తాళ్లపల్లి శ్రీరామారావు ఎమ్మెల్యే తనయుడు కోనేరు వంశీతో కలిసి మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మ్యానిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయని అదేవిధంగా ఇంటింటా సంక్షేమ పథకాలు అందాయన్నారు. మరోసారి కారు గుర్తుకు ఓటు వేసి కోనప్పను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని అభ్యర్థించారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి మండల కన్వీనర్ కంభగౌని సంతోష్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కౌటాల: శివలింగపూర్‌లో మ్యానిఫెస్టోను వివరిస్తున్న సర్పంచ్ మౌనిశ్, నాయకులు



దహెగాం : కమ్మర్‌పల్లిలో మ్యానిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తున్న జడ్పీటీసీ శ్రీరామారావు

## ఎస్ఈఏఎస్ శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో సోమయ్య

కౌటాల, అక్టోబర్ 31: స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వేలో భాగంగా కౌటాల, చింతలమానేపల్లి మండలాల్లోని ఎంపికైన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లకు మండలకేంద్రంలోని రైతు వేదికలో ఎంఈవో సోమయ్య మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష నిర్వహణ, వారికి పరీక్ష నిర్వహించే విధానం, ఓఎంఆర్ షీట్ నింపడం, పరీక్షలకు సంబంధించి అన్ని రకాల వివరాలను తెలియజేశారు. ప్రతిఒక్కరూ తప్పకుండా ఈ సూచనలు పాటించి పరీక్షలు నిర్వహించాలని సూచించారు. మండల నోడల్ అధికారులు హన్మం తు, జయరాజ్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.



శిక్షణలో పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు, ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్

## రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలు

సిర్పూర్(టీ), అక్టోబర్ 31 : సిర్పూర్(టీ)– కాగజ్‌నగర్ ప్రధాన రహదారిలోని పెద్దబండ గ్రామ శివారులో గల శ్రీ లక్ష్మీ భార్గవి రైస్‌మిల్ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో లక్ష్మీపూర్‌కు చెందిన ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్ఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. దీపక్ బరాయి బైక్‌పై వెళ్తూ ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టడంతో దీపక్ బరాయికి తీవ్ర గా యాలయ్యాయి. దీంతో దీపక్‌ను కాగజ్‌నగర్‌లోని దవా ఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## రాజశ్యామల మహాయాగం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప దంపతులు

సిర్పూర్(టీ), అక్టోబర్ 31 : మండలకేంద్రంలోని సంతోషిమాత ఆలయంలో యాగ సంకల్పకర్త హేమలత, లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో లోక సంరక్షణార్థం, విశ్వ కల్యాణం కోసం యాజ్ఞాచార్యులు దుద్దీళ్ల మనోహర అవధానిలచే మూడు రోజుల పాటు నిర్వహించే త్రికుండా రాజ శ్యామల మహాయాగాన్ని మంగళవారం ప్రారంభించారు. తెల్లవారుజాము నుంచే దాదాపు 21 మంది వేద పండితులతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో యాగం నిర్వహించారు. మొదటి రోజు ఉదయం యాగ సంకల్పం, అఖండ జ్యోతి ప్రజ్వలనం, గణపతి పూజ, నవగ్రహవాస్తు యోగిని, క్షేత్రపాలక, సర్వతోభద్ర మంటప స్థాపన పూజలు, అగ్ని ప్రతిష్ఠ రుద్రాభిషేకం, చండీ పారాయాణం, గణపతి, నవగ్రహ హోమాలు నిర్వహించారు. భక్తులు హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

### ఎమ్మెల్యే దంపతుల పూజలు

మహాయాగంలో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, జడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోనప్ప దంపతులకు వేదపండితులు ఆశీర్వచనాలు తీసుకున్నారు. ఆయన వెంట కాగజ్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, వైస్ ఎంపీపీ ఈర్ల సత్యనారాయణ, ఉప సర్పంచ్ తోట మహేశ్, బీఆర్ఎస్ నాయకులు బొమ్మన శ్రీనివాస్, తిరుపతి పాల్గొన్నారు.